పెండింగ్ దరఖాస్తులపై దృష్టిపెట్టాలి

● జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, జనవరి 17: పెండింగ్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సంతోష్ తాసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీలో తాసీల్దార్లు, సూపరింటెండెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ధరణి, భూసేకరణ, ఓటర్ జాబితా, భారత్‌మాల తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వెంటనే నివేదిక ఇవ్వాలని తాసీల్దార్లను ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ధరణికి సంబంధించి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, అందులో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని పరిష్కారమయ్యాయని అడిగి తెలుసుకున్నారు. ధరణికి సంబంధించి మండలాలవారీగా నివేదిక ఇవ్వాలన్నారు. ఓటర్ జాబితాపై మాట్లాడుతూ.. ఫారం-6,7,8కు సంబంధించి పెండింగ్‌లో ఉన్నవాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈనాం భూములకు సంబంధించి పూర్తి అవగాహన ఉండాలన్నారు. తాసీల్దార్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నవాటిని గుర్తించి వాటిని ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలన్నారు. భారత్‌మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వాటి వివరాలతోపాటు భూములకు సంబంధించి పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రితిరాజ్‌తో కలిసి మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గంజాయి, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలను గుర్తించి వాటి నిర్మూలనకు కృషి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా గంజాయి సాగు జరిగితే ఎక్సైజ్, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూడాలన్నారు. విద్య, ఆరోగ్య, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో మత్తు పదార్థాలకు నిర్మూలించవచ్చన్నారు. జిల్లాలో కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కల్తీ మందులు అమ్మే మెడికల్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా నివేదిక అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగు చేస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో కళాజాత బృందాలతో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్పీ రితిరాజ్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో పొలాల్లో గంజాయి పంట పండించిన దొరికిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ ఉత్పత్తి, సరఫరా, రవాణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవి, ఆర్డీవో చంద్రకళ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్, వైద్యాధికారి శశికళ, అధికారులు ముసాయిదా బేగం, వాజీద్, బానోత్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

ఓటరు క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి, జనవరి 17 : జనవరి 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2024 నాటికి 18 ఏండ్లు నిండిన యువత తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. శని, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కింద ప్రతి బీఎల్‌వో తన పోలింగ్ కేంద్రంలో ఉంటారని, అక్కడ ఫారం 6 తీసుకొని లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు సైతం తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే రూపొందించిన ఓటరు జాబితాలో పేరులో తప్పులు ఉన్నా లేక పోలింగ్ స్టేషన్ మార్చుకోవాలని అనుకున్నా ఫారం 8 ద్వారా మార్చుకోవచ్చునని తెలిపారు.

గురుకుల విద్యార్థి మిస్సింగ్

ధరూరు, జనవరి 17 : గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివానందన్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మార్లబీడు గ్రామానికి చెందిన ప్రభుదాస్ కుమారుడు నితీష్‌కుమార్ ర్యాలంపాడు హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన నితీష్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని బాలుడి మృతి

వరుణ్ (ఫైల్)

పెబ్బేరు, జనవరి 17 : బైక్‌పై ముగ్గురు వెళ్తూ ప్రమాదవశాత్తు డివైడర్ ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన పెబ్బేరులో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం మంగళవారం పెబ్బేరుకు చెందిన వైన మోని వరుణ్ (17), అభినయ్, రేవంత్‌గౌడ్‌లు 44వ నెంబరు జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. వరుణ్‌కు తీవ్రగాయాలు కాగా వెంటనే వనపర్తి, తర్వాత హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడు పెబ్బేరులోని తెలంగాణ మోడల్ స్కూల్లో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. బుధవారం వనపర్తి ఏరియా దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై జయరాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 17: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై కృష్ణదేవ కథనం మేరకు.. ఎర్రవల్లి మండలం కోదండాపూర్‌కు చెందిన శ్రీరాములు(34) బైక్‌పై మంగళవారం కోదండాపూర్ ఎక్స్‌రోడ్డు దాటుతుండగా కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో శ్రీరాములుకు తీవ్రగాయలయ్యాయి. క్షతగాత్రుడిని కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తులకు గడువు పెంపు

గద్వాలటౌన్, జనవరి 17 : సాంఘిక సంక్షేమ గిరిజన వెనుకబడిన తరగతుల గురుకులాల్లో 2024-25 సంవత్సరంలో ఐదో తరగతి, కళాశాలలో ఉమ్మడి ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు డీసీవో రఘు బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగు, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆయా సంక్షేమ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హత సాధించిన విద్యార్థులకు ఉమ్మడి జిల్లా యూనిట్‌గా సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

దరఖాస్తుల డిజిటలైజేషన్ పూర్తి

మల్దకల్, జనవరి 17 : మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల డిజిటలైజేషన్ పూర్తి అయ్యిందని తాసీల్దార్ హరికృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో మొత్తం 14,666దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజాపాలన ముగిసిన తర్వాత అదనంగా రెవెన్యూ కార్యాలయంలో ప్రజలు వెయ్యి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. మొత్తం దరఖాస్తులను డిజిటలైజేషన్ చేసినట్లు ఆయన తెలిపారు.

రైస్‌మిల్లర్ల మండల కార్యవర్గం ఎన్నిక

కొత్తకోట, జనవరి 17 : మండల రైస్‌మిల్లు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విశ్వనాథం వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఎద్దుల రవీందర్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా విష్ణు, చవ్వ శ్రీనివాసులు, కార్యదర్శులుగా గుంత మల్లేశ్, చంద్రశేఖర్, కోశాధికారిగా కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నాగన్న, రమణ, కార్యవర్గ సభ్యులుగా కొట్టం వంశీధర్‌రెడ్డి, బీమా భాస్కర్, బాలకృష్ణారెడ్డి, సంతోష్, రవితేజ, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్, జనవరి 17 : పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరప్రసాద్‌రావు, చంద్రశేఖర్, ప్రసాద్, జయంత్‌రెడ్డి, శ్రీను, రాములు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి తరలిన గద్వాల ఎమ్మెల్యే

సమావేశానికి తరలివెళ్తున్న ఎమ్మెల్యే బండ్ల, ప్రజాప్రతినిధులు

గద్వాల,జనవరి 17 : తెలంగాణ భవన్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా జోగులాంబ గద్వాల జిల్లా నుంచి గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ సహా జిల్లా నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరంతా ప్రత్యేక బస్‌లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్, పీఏసీసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డితోపాటు నాయకులు గడ్డంకృష్ణారెడ్డి, రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, విక్రమసింహారెడ్డి, ఆనంద్, అంగడిబస్వరాజ్, వీరన్న, రాము శెట్టి, రమేశ్‌నాయుడు, వేణుగోపాల్, భాస్కర్ ఉన్నారు.

ఆయకట్టు రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే శ్రీహరి

ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, జనవరి 17: మండలంలోని జూరాల ఆయకట్టు రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. జూరాల ప్రాజక్టు ఎడమ కాల్వ పరిధిలోని డీ-6 కాల్వ ఆయకట్టు రైతులు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. పంటలు చివరిదశలో ఉన్న పరిస్థితుల్లో ఒక్క తడికోసం కాల్వకు నీరు విడుదల చేయాలని వారంతా ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. వారి సూచనల మేరకు నీటిని విడుదలకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తంచేశారు. నేటి నుంచి మూడు రోజులపాటు ఒక తడికోసం నీటి విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీహరి ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మొగిళి గంగాధర్‌గౌడ్, వెంకటన్న, రహమతుల్లా, బాలకిష్టన్న పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, జనవరి 17 : నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కనిమెట్టలో 2019 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధి పనులను వివరించే క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు సర్పంచ్ పరమేశ్ తెలిపారు. అభివృద్ధి పనులపై ఈ క్యాలెండర్‌ను రూపొందించి దానిని ఆవిష్కరించి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమాజ శ్రేయస్సుకే గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ సేవలు

అయిజ, జనవరి 17: సమాజంలోని ప్రతిఒక్కరికీ సేవలు అందించేందుకు గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ అహర్నిశలు కృషి చేస్తున్నదని గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ ఫౌండర్ శ్యాం గుంటి అన్నారు. బుధవారం పట్టణానికి సమీపంలోని ఉప్పల రోడ్డులో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆయా గ్రామాల్లోని చిన్నారులకు మొదటి ప్రాథాన్యత ఎవరికి.. ఎందుకు ఇవ్వాలి అనే అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్య, క్రమశిక్షణ, తల్లిదండ్రులు, పెద్దలతో మెలగాల్సిన విధానంపై మూడురోజులపాటు వివిధ చర్చీల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. పదేండ్లుగా గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ సంస్థ దివ్యాంగులకు మందులు, ట్రై సైకిళ్లు, ఆహారం అందించడం జరుగుతుందన్నారు. పేదలకు కంటి అద్దాలు, ఉచిత వైద్యం అందించడం, జీఎల్ఎంతో అయిజ పట్టణంలో సుమారు 2వేల మంది పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందజేస్తున్నామన్నారు. తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల్లో సుమారు లక్ష మంది చిన్నారులకు శిక్షణ తరగతులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆట, పాటలు, శ్యాంగుంటి చేసిన పప్పేట్ షోలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీఎల్ఎం సభ్యులు టాక్ జాన్సన్, సైమన్, జాన్‌డేవిడ్, రత్నాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గుడ్‌లైఫ్ మినిస్ట్రీస్ ఫౌండర్ శ్యాంగుంటి

శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

రద్దీగా మారిన వనపర్తి బస్టాండ్

వనపర్తి టౌన్, జనవరి 17 : జిల్లా కేంద్రంలోని బస్టాండ్, డిపో ప్రాంగణం ప్రయాణికులతో సందడిగా మారింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో ఉద్యోగులు, విద్యార్థులు పాఠశాల, కళాశాలల హాస్టళ్లకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బుధవారం తిరిగి ప్రారంభం కావడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. అదేవిధంగా సంక్రాంతికి కొత్త అల్లుళ్లు, ఆడ పడుచులు జిల్లాలోని వారి స్వగ్రామాలకు వెళ్లి తిరుగు ప్రయాణం కావడంతో బస్సులు జనాలతో కిక్కిరిశాయి. బస్సుల కోసం బస్టాండ్, డిపో ఎదురుగా, రోడ్లపై జన సందోహం కనిపించింది.

బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

లైసెన్స్ లేకుండా కల్లు విక్రయిస్తే చర్యలు

గద్వాల అర్బన్, జనవరి 17 : లైసెన్స్ లేకుండా కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ గోపాల్ హెచ్చరించారు. గద్వాల, మల్దకల్, ధరూర్, కేటీదొడ్డి మండలాల్లోని వివిధ గ్రామాల్లో లైసెన్స్ లేకుండా అక్రమంగా కల్లు విక్రయిస్తున్న కల్లు దుకాణాలపై ఆబ్కారీ శాఖ అధికారులు మంగళ, బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ గోపాల్ మాట్లాడుతూ జిల్లా ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ సైదులు ఆదేశాల మేరకు.. గద్వాల ప్రాంతంలో అక్రమంగా వెలిసిన కల్లు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి, లైసెన్స్ లేకుండా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలను బేఖాతరు చేసి అక్రమంగా కల్లు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఆబ్కారీ శాఖ ఎస్సై రాజేందర్‌రెడ్డి, గోవర్ధన్, కృష్ణ, మొగులప్ప ఉన్నారు.

మొక్కల పెరుగుదలకు చర్యలు చేపట్టాలి

అయిజ, జనవరి 17: హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు విరివిగా నాటి వాటి పెరుగుదలకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సాయిప్రకాశ్ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని ఉత్తనూర్, భూంపురం తదితర గ్రామాల నర్సరీలను ఎంపీడీవో పరిశీలించారు. వేసవిలో ఎండల తీవ్రత పెరిగే సూచనలు కనిపిస్తున్న దృష్ట్యా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలకు అవసరమైన మేరకు నీటి సరఫరా చేయాలని కోరారు. వచ్చే వానకాలంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఏ అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

పాన్‌గల్, జనవరి 17 : మండలకేంద్రంతోపాటు కేతేపల్లి గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న ఆరోగ్య సంక్షేమ పథకాలపై బుధవారం డాక్టర్లు నిహారిక, లారెన్స్, ఎస్‌బీఐ మేనేజర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కళాకారుల బృందం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ క్షయవ్యాధి, ఆయుష్మాన్ భారత్ కార్డు వల్ల ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామయ్య, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి హరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భోగ భాగ్యాల నుంచి బయటపడటమే భోగి

కేటీదొడ్డి, జనవరి 17 : భోగభాగ్యాల నుంచి బయట పడడమే నిజమైన భోగి పండుగకు అర్థమని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. మండలంలోని నందిన్నె గ్రామంలో సంక్రాంతి, భోగి పండుగను పురస్కరించుకుని బుధవారం పండుగల విశిష్టతను తెలియజేస్తూ త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగవద్గీత సారాంశం ప్రకారం సంక్రాంతి అంటే సుఖ భోగాలను విడిచిపెట్టి, కర్మలను కాల్చి వేసే విధానమే భోగి మంటల విశిష్టత అని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రచార వాహిణి సభ్యులు రవికుమార్, మనోహర్, రమేశ్, యాది, మహేశ్, లావణ్య, సువర్ణ, భాగ్య, మంజుల, సబిత, శిరీష పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు

అయిజ, జనవరి 17: అయిజ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ అయోధ్య రాములోరి అక్షింతలు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీలు భాజా భజంత్రీలు, మేళతాళాలు, భక్తుల జై శ్రీరాం నినాదాలతో అక్షింతలు పురవీధుల గుండా ఊరేగించిన అనంతరం గడప, గడపకూ పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ అక్షింతలు శిరస్సుపై వేసుకుని శ్రీరామ నామస్మరణ చేయాలని అర్చకులు, పండితులు సూచించారు. పల్లెలు, పట్టణం శ్రీరామ నామస్మరణలతో మార్మోగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

ధరూర్, జనవరి 17 : అయోధ్యలో రామ మందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ గ్రామాలకు పంపిన అక్షింతలను గ్రామస్తులు ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. నెట్టెంపాడులో భక్తులు జై శ్రీరాం నామస్మరణతో ఇంటింటికీ తిరిగి అక్షింతలు పంపిణీ చేశారు.

ఒకరికి రిమాండ్

ధరూరు, జనవరి 17 : ఇద్దరు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న కేసులో ఒకరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శివానందన్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని రేవులపల్లి గ్రామానికి చెందిన గట్టు ఆంజనేయులు, లక్ష్మయ్య మంగళవారం మధ్యాహ్నం గ్రామంలో గొడవపడి ఒకరిపై ఒకరు కేసు పెట్టుకున్నారు. ఈ ఘర్షణపై కేసు నమోదు చేసిన ఎస్సై లక్ష్యయ్య బుధవారం వారిని కోర్టులో హాజరుపర్చగా 14రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.

అ'పూర్వ' కలయిక

పెబ్బేరు, జనవరి 17 : పెబ్బేరులో బుధవారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఓ ఫంక్షన్ హాల్లో కలుసుకొని ఆత్మీయతానుబంధాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు.

పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, జనవరి17: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థిదశలో మరుపురాని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహయ్య, కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, ధర్మారెడ్డి, జ్యోతి, పూర్వ విద్యార్థులు వీరశేఖర్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమందడి మండలకేంద్రంలో..

పెద్దమందడి, జనవరి 17: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్న పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు బుధవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 19 ఏండ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం వారికి బోధించిన గురువులు వెంకటప్రసాద్, మద్దిలేటి, రాంచంద్రయ్య, నర్సమ్మ, ఇందిర, ప్రకాశ్‌లను పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉన్నారు.

పెబ్బేరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెద్దమందడిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్న పూర్వ విద్యార్థులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్ to నాగర్‌కర్నూల్ హైవే ఫేసింగ్ 300 ఎకరాల డిటిసిపి అప్రూవల్ లేఔట్‌లో 99 నెలల EMI ఫెసిలిటీ కలదు. Marketing Executives కావలెను. Cont: 9133399095
NT- 320376

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry